జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 30 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 6

## ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందాలి


- మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వాన్ని క్రీడలు అందిస్తాయి.
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.




**పాల్వంచ, ఆగస్టు 29, ప్రజాజ్యోతి:** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధి నిర్వహణతో నిరంతరం బిజీగా ఉన్నప్పటికీ, క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉత్సాహాన్ని, ఆరోగ్యాన్ని, పరస్పర ఐక్యతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఉపాధ్యాయ

మిగతా 2 లో...

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 29, (ప్రజాజ్యోతి)** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా

మిగతా 2 లో...



# నన్ను ఆపేది ఎవడు..?

- సరిహద్దు దాటుతున్న ఇసుక మాఫియా..!
- ఆంధ్ర నుంచి తెలంగాణకు అక్రమ ఇసుక రవాణాపై ఆరోపణలు

**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 29**

అధికారుల నిఘాకు సవాల్ విసురుతున్నారెవరు..?

సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్లు ఇతర వాహనాల ద్వారా ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారనే విమర్శలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

అనుమతులు ఉన్నాయా? బిల్లులు ఉన్నాయా? రవాణాకు సరైన పత్రాలు ఉన్నాయా? ఒక రాష్ట్రంలో లోడ్ చేసిన ఇసుక మరో రాష్ట్రంలోకి ఎలా ప్రవేశిస్తోంది? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

"నన్ను ఆపేది ఎవడు..?" అన్నట్టుగా దందా..!

అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు ఆరోపణలు వస్తున్నప్పటికీ కొందరు మాత్రం ఏమాత్రం భయపడకుండా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "నన్ను ఆపేది ఎవడు..?" అన్న ధీమాతోనే సరిహద్దు చెక్‌పోస్టులు, అధికారుల నిఘాను దాటుకుని ఇసుక రవాణా జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఒకవైపు ప్రభుత్వాలు ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతుంటే, మరోవైపు సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఎవరి అండతో సరిహద్దు దాటుతోంది?**

ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక లోడుతో బయలుదేరిన వాహనాలు తెలంగాణలోకి వస్తే, వాటిని తనిఖీ చేసే బాధ్యత ఎవరిది? రవాణా పత్రాలు

మిగతా 2 లో...

## మౌలానా మృతితో భగ్గుమన్న జింకలగూడెం

- నిందితుడి ఇంటికి నిప్పు.. మృతదేహంతో బంధువుల ఆందోళన
- భారీగా మోహరించిన పోలీసులు.. గ్రామంలో ఉద్రిక్తత



**బూర్గంపహాడ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** మౌలానా మృతితో జింకలగూడెం గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈనెల 23న కారుతో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన షేక్ మౌలానా (38) ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబసభ్యులు, బంధువులు నిందితుడి ఇంటిపై దాడి చేసి నిప్పంటించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. షేక్ మౌలానాను అదే గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ తన స్కార్పియో కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధం విషయమై ఇద్దరి మధ్య వివాదం ఏర్పడినట్లు వారు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో మౌలానా తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు వెంటనే ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మౌలానా మృతిచెందాడు. మృతిచెందిన విషయం తెలియడంతో కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. నిందితుడైన ఇస్మాయిల్ ఇంటి వద్దకు చేరుకుని ఇంటికి నిప్పంటించడంతో పాటు ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారు బయటకు పరుగులు తీశారు. అనంతరం ఇస్మాయిల్ బావ ఇంటిపైనా దాడి చేసి సామాగ్రిని

మిగతా 2 లో...

## కాంకేర్‌లో నక్సలైట్ ల డంప్ గుర్తింపు

- డంప్‌లో పంగోలిన్ పొలుసులు
- 3.5 కిలోల పంగోలిన్ పొలుసులు,ఇతర సామాగ్రి స్వాధీనం

2 లో...



## కాంకేర్‌లో నక్సలైట్ ల డంప్ గుర్తింపు



చర్ల, ఆగస్టు 29: (ప్రజాజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో నక్సల్ నిర్మూలన చర్యల్లో భద్రతా దళాలు ఛోటేబెథియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోర్ఖండి గ్రామ సమీపంలోని అటవీ, కొండ ప్రాంతంలో నిర్వహించిన సంయుక్త గాలింపు చర్యల్లో నక్సలైట్లు దాచిన డంప్‌ను గుర్తించి పలు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు అధికారుల ఆదేశాల మేరకు జిల్లా భద్రతా దళాలు బీఎస్‌ఎఫ్, బీడీఎస్ బృందాలు సరిహద్దు ప్రాంతాల్లో సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మోర్ఖండి అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా దాచిన నక్సలైట్ స్థావరాన్ని గుర్తించారు. అక్కడ సుమారు 3.5 కిలోల బరువున్న పంగోలిన్ పొలుసులు స్టీల్ టిఫిన్‌లో భద్రపరిచి ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఇతర నక్సలైట్ సామగ్రిని కూడా స్వాధీనం చేసుకుని ఛోటేబెథియా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.పంగోలిన్ పొలుసులు లభ్యమైన విషయాన్ని అటవీ శాఖ అధికారులకు పోలీసులు సమాచారం అందించారు. నక్సలైట్లు ఈ పొలుసులను ఏ ఉద్దేశంతో నిల్వ చేశారనే అంశంతో పాటు, వన్యప్రాణుల అక్రమ రవాణా నెట్‌వర్క్‌తో సంబంధం ఉందా అనే కోణంలో అటవీ శాఖ, పోలీసులు దర్యాప్తు చేపట్టారు అని అధికారులు తెలియచేసారు.నక్సల్ ప్రభావిత, సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా దళాల గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతాయని కాంకేర్ పోలీసులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు విస్తృతంగా తనిఖీలు, గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు అన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేసి యాప్ లో వివరాలు నవీకరించడం జరిగిందని తెలిపారు. నోటీసుల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# నన్ను ఆపేది ఎవడు..?

(మొదటి పేజీ తరువాయి...)

సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది ఎవరు పరిశీలిస్తున్నారు? అక్రమ రవాణా జరుగుతుందన్న ఫిర్యాదులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఇవే ఇప్పుడు ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్న అంశాలు.

సరిహద్దు దాటుతున్న ప్రతి వాహనంపై తనిఖీ జరుగుతోందా?

ఇసుక మూలం ఎక్కడ? గమ్యం ఎక్కడ?

రవాణాకు అనుమతులు ఉన్నాయా?

రాయల్టీ, బిల్లులు, ఈ-వే లేదా ఇతర అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయా?

ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు వస్తున్న ప్రతిసారి తనిఖీలు, కేసులు, చర్యలు అనే మాటలు వినిపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిజంగా అక్రమ రవాణా జరుగుతుంటే సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ, పోలీస్, మైనింగ్, రవాణా శాఖలు సంయుక్తంగా సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యావరణానికీ.. ప్రభుత్వ ఆదాయానికీ ముప్పే..!

అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, రవాణా జరిగితే అది కేవలం ప్రభుత్వ ఆదాయ నష్టానికే పరిమితం కాదని పర్యావరణంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లో విచక్షణారహితంగా ఇసుక తొలగింపు జరిగితే భూగర్భ జలాలు, వ్యవసాయం, పర్యావరణ సమతుల్యతపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

ప్రజల ప్రశ్నకు సమాధానం చెప్పేదెవరు..?

ఆంధ్ర ఇసుక తెలంగాణకు ఎలా వస్తోంది..?

అనుమతులతోనా..? అక్రమంగానా..?

### ఇసుక లారీలు.. ట్రాక్టర్లు.. ఎవరి కనుసన్నల్లో..?

ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రశ్నలు ఇవే..

ఆంధ్ర నుంచి తెలంగాణకు ఇసుక తీసుకురావడానికి చట్టబద్ధ అనుమతులు ఉన్నాయా?

రోజుకు ఎన్ని వాహనాలు సరిహద్దు దాటుతున్నాయి?

రాత్రి వేళల్లో ప్రత్యేకంగా రవాణా ఎందుకు జరుగుతోందన్న అనుమానాలు?

చెక్‌పోస్టులు, సంబంధిత శాఖల తనిఖీలు ఎంతవరకు జరుగుతున్నాయి?

అక్రమ రవాణా జరిగితే ప్రభుత్వ ఆదాయానికి ఎంత నష్టం?

గతంలో పట్టుబడిన వాహనాలపై తీసుకున్న చర్యలేమిటి?

పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు ఎప్పుడు?

పట్టించుకోని అధికారులా..? లేక నిఘా లోపమా..?

అక్రమమైతే బాధ్యులపై చర్యలు ఎప్పుడు..?

"నన్ను ఆపేది ఎవడు..?" అంటూ చట్టాన్ని సవాల్ చేస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దు దాటుతున్న ఇసుకపై ప్రత్యేక నిఘా పెట్టాలి..!

అక్రమ రవాణా జరిగితే మూలాలను గుర్తించాలి..!

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..!

లేకపోతే... "నన్ను ఆపేది ఎవడు..?" అన్న ఇసుక మాఫియా ధీమా మరింత పెరగదా..?

## ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందాలి

(మొదటి పేజీ తరువాయి...)

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల ప్రాంగణంలో ఐటీడీఏ జిల్లా క్రీడల అధికారి బి. గోపాలరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. క్రీడా పోటీలను ఉదయం సెషన్‌లో భద్రాచలం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ చందన సర్పే ప్రారంభించగా, మధ్యాహ్నం సెషన్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బి. రాహుల్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులలో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, సమిష్టితత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యత మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. భద్రాచలం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ చందన సర్పే మాట్లాడుతూ ఈ నెల 30న ఫైనల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సుమారు 390 మంది గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్‌తో పాటు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట, పాల్వంచ గిరిజన సహాయ సంక్షేమ అధికారులు (ఏటీడీవోలు) ఎస్. చంద్రమోహన్, భారతీదేవి, రాధమ్మ, ఏసీఎంవో రాములు, ప్రభుత్వ గిరిజన క్రీడా పాఠశాల కిన్నెరసాని ప్రధానోపాధ్యాయులు ఎన్. చందు, సహాయ క్రీడా అధికారులు కొమరం వెంకటనారాయణ, ఎస్. నాగేశ్వరరావు, బి. రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్. బాలసుబ్రహ్మణ్యం, శ్రీనగేష్, పి. శిరోమణి, వాణి, ఎల్. బద్రు, బి. హర్షా, బి. హరికృష్ణ పాల్గొన్నారు.

# మౌలానా మృతితో భగ్గుమన్న జింకలగూడెం

(మొదటి పేజీ తరువాయి...)

ధ్వంసం చేసినట్లు సమాచారం.విషయం తెలుసుకున్న బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటికి అంటుకున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు.

**మృతదేహంతో నిందితుడి ఇంటి వద్ద ఆందోళన**





శనివారం మధ్యాహ్నం ఖమ్మం నుంచి అంబులెన్స్‌లో మౌలానా మృతదేహాన్ని జింకలగూడెం గ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహాన్ని నిందితుడి ఇంటి వద్దకు తీసుకువెళ్లేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కొంతసేపు పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం మృతదేహంతో ఉన్న అంబులెన్స్‌ను నిందితుడి ఇంటి ఆరుబయటకు తీసుకువెళ్లారు. మౌలానా మృతదేహాన్ని అక్కడ ఉంచి కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**– భారీగా పోలీసుల మోహరింపు**

పరిస్థితి తీవ్రత దృష్ట్యా పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, సుమారు 40 మంది కానిస్టేబుళ్లతో పాటు సీఆర్పీఎఫ్ సిబ్బందిని బందోబస్తు కోసం రంగంలోకి దించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిందితుడి ఇంటి పరిసరాలతో పాటు గ్రామంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**– న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ**

ఆందోళన చేస్తున్న మౌలానా కుటుంబ సభ్యులు, బంధువులతో డీఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడారు. ఘటనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే కుటుంబ పెద్దను కోల్పోయామని, మౌలానా మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని కుటుంబసభ్యులు, బంధువులు స్పష్టం చేశారు .మౌలానాకు భార్య షాకీరాబేగంతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# మావోయిస్టుల సామాగ్రి స్వాధీనం

- రూ.50 వేల నగదు, పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం
- నక్సలైట్ సభ్యుడి అరెస్టు



**చర్ల , ఆగస్టు 29:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో కీలక విజయం సాధించాయి. బాసగూడ పోలీస్‌స్టేషన్, డీఆర్‌జీ సంయుక్త బృందం పెగడపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో చేపట్టిన గాలింపు చర్యల్లో ఒక అనుమానిత నక్సల్ అనుచరుడిని అరెస్టు చేసి, భారీగా నగదు, పేలుడు పదార్థాలు, ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం ఆగస్టు 29న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా బాసగూడ పోలీస్‌స్టేషన్, డీఆర్‌జీకి చెందిన సంయుక్త బృందం పెగడపల్లి అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టింది. ఈ సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని గుర్తించిన భద్రతా సిబ్బంది చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని తారెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నగేలూరు గ్రామానికి చెందిన పాండు కుమారుడు బోగం లఖ్ము (39)గా గుర్తించారు.విచారణలో లఖ్ము నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) సంస్థకు చెందిన చిన్నగేలూరు డీఏకేఎంఎస్ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. నక్సల్ సామగ్రి, పేలుడు పదార్థాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించి, అటవీ ప్రాంతాల్లో రహస్యంగా దాచిపెట్టేవాడని పోలీసులు పేర్కొన్నారు.నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన భద్రతా దళాలు రూ.50,050 నగదు, ఒక బీజీఎల్ లాంచర్, 18 బీజీఎల్ సెల్స్, 12 తీర్ బాంబులు, ఒక హ్యాండ్ గ్రెనేడ్ స్వాధీనం చేసుకున్నాయి. అదే విధంగా .303 రైఫిల్‌కు చెందిన 15 సజీవ తూటాలు, 31 బీజీఎల్ కాట్రిడ్జ్‌లు, ఒక ఖాళీ ఇన్‌సాస్ మ్యాగజైన్, విద్యుత్ తీగలు, మూడు రౌండ్ ఛార్జర్లు, ఒక ఎమిటర్ లీడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.స్వాధీనం చే సుకున్న పేలుడు పదార్థాలు, ఆయుధ సామగ్రిని పోలీసులు సీజ్ చేసి, పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై పేలుడు పదార్థాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరెస్టు చేసిన నిందితుడిని చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. బీజాపూ ర్‌లోని సున్నితమైన అటవీ ప్రాంతాల్లో నక్సల్ కార్యకలాపాలను అరికట్టేందుకు భద్రతా దళాలు నిరంతరం గా లింపు చర్యలు కొనసాగిస్తున్నాయని అ ధికారులు తెలిపారు. నక్సల్ నె ట్‌వ ర్క్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు, వారి రహస్య స్థావరాలపై నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలియచేసారు.

## బత్తినపల్లిలో హెల్త్ క్యాంప్

- 46 మందికి మందుల పంపిణీ



**చర్ల, ఆగస్టు 29 : (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బత్తినపల్లి గ్రామంలో శనివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ప్రస్తుతం జ్వరాల కేసులు ఏవీ లేవని వైద్య సిబ్బంది తెలిపారు.ఈ శిబిరంలో జలుబు, దగ్గు, దురద తదితర సాధారణ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. మొత్తం 46 మందికి సాధారణ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్లప్పుడూ పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, నీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని తెలిపారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా పలు వ్యాధులను నివారించవచ్చని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జె. సంధ్య, ఏఎన్ఎం జి. రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్, ఆశా వర్కర్ అమ్మాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కార్పొరేటర్ బత్తుల మధుచంద్

- టీచర్స్ కాలనీలో మహిళల తాగునీటి కష్టాలకు చెక్
- నూతన పవర్ బోర్ ఏర్పాటు



**పాల్వంచ, ఆగస్టు 29, ప్రజాజ్యోతి:** ప్రజల అవసరమే నా ప్రాధాన్యత. ఇచ్చిన మాటే నా బాధ్యత అంటూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్.పాల్వంచ 38వ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో తాగునీటి కోసం ఎన్నో ఏళ్లుగా చేతిపంపులపై ఆధారపడుతూ ఇబ్బందులు పడుతున్న మహిళల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా కార్పొరేటర్ చర్యలు చేపట్టారు. మహిళల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేకంగా నూతన పవర్ బోర్‌ను మంజూరు చేయించారు.మంజూరైన పవర్ బోర్ పనులను కార్పొరేటర్ బత్తుల మధుచంద్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీంతో టీచర్స్ కాలనీ మహిళల్లో హర్షం వ్యక్తమైంది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

» రాఖీలు కట్టి.. అభినందనలు తెలిపిన మహిళలు...



పవర్ బోర్ మంజూరు చేయించి పనులు ప్రారంభించిన సందర్భంగా స్థానిక మహిళలు కార్పొరేటర్ బత్తుల మధుచంద్‌ను ఘనంగా సన్మానించారు. రక్షాబంధన్ సందర్భంగా ఆయనకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు.ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన కార్పొరేటర్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న మధుచంద్ సేవలను మహిళలు అభినందించారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**మణుగూరు, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ):** మణుగూరు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా ఉద్యమ పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ యార్నం చిన్నప్పయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను గొప్పగా వివరించారు. తెలుగు భాషను అందరు ప్రేమించాలని, తెలుగు భాషలో అక్షర దోషాలు లేకుండా విద్యార్థులు రాయడం నేర్చుకోవాలని, తెలుగు భాషపైన పట్టు సాధించాలని సూచించారు. తెలుగు భాష ప్రాముఖ్యతను, ఔన్నత్యాన్ని తెలియజేసి, తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ పొక్కిలి భాస్కరరావు, డాక్టర్ సాంబబమూర్తి, డాక్టర్ అశోక్, శివ కుమార్, నాగిరెడ్డి, కారం శిరీష, బూర్గుల సతీష్, సువర్ణ, సోడే నవీన్ కుమార్, స్నేహ, ప్రశాంతి, నరసింహారావు, కవిరాజ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వేదాంతపురం అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి

- తొమ్మిది మంది అదుపులో.. నగదు, వాహనాలు స్వాధీనం



**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 29** అశ్వరావుపేట మండలం వేదాంతపురం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.వారి వద్ద నుంచి రెండు కార్లు సహా తొమ్మిది వాహనాలు, 16 సెల్ ఫోన్లు నగదు రూ.1,22,300 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆపదలో అండగా డాక్టర్ చంద్రశేఖర్

- మానవత్వంతో కుటుంబానికి ఆర్థిక సాయం



**చర్ల, ఆగస్టు 29(ప్రజా జ్యోతి ) :** ఆపదలో ఉన్న కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్‌జీవో ప్రతినిధి డాక్టర్ దేవగురి చంద్రశేఖర్ మానవత్వంతో ఆర్థిక సహాయం అందించారు. చర్ల మండలానికి చెందిన దండేకార్ నవీన్, కమల దంపతుల కుమారుడు తీవ్ర జ్వరం, లివర్ ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్న విషయం సోషల్ మీడియా, బంధువుల ద్వారా డాక్టర్ దేవగురి చంద్రశేఖర్ దృష్టికి వచ్చింది.దీంతో స్పందించిన ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన యువత సహకారంతో కొంత నగదును సమకూర్చారు. ఈ మొత్తంలో భాగంగా రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని చర్ల మేజర్ గ్రా మపంచాయతీ సర్పంచ్ శ్రీమతి పూజారి సామ్రాజ్యం చేతుల మీదుగా కమల కుటుంబానికి అందజేశారు.ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ దేవగురి చంద్రశేఖర్ (స్పార్ట్), సా మర్లకోట యువతకు కమల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సెప్టెంబర్ 1న జరిగే ఐ ఎఫ్ టి యు సదస్సును జయప్రదం చేయండి

**గుండాల ఆగస్టు 29 ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో జరిగే ఐఎఫ్టియు జిల్లా సదస్సును జయప్రదం చేయాలని మా సంఘం జిల్లా అధ్యక్షులు సారంగపాణి, మండల కార్యదర్శి యాసారపు వెంకన్నలు కోరారు. శనివారం గుండాల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులను, అమాలి కార్మికులను, కేజీబీ బి, మిషన్ భగీరథ కార్మికుల వద్ద నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం నగేష్, భానుచంద్య, చేబోతు రవి, మెంతిని నాగేష్, చింతా నరసయ్య, సత్తు ధనరాజ్, ఆవుల సదానందం, మాచర్ల రాకేష్, కొండ్రు శైలజ తదితరులు పాల్గొన్నారు.






## పోలీసు కొలువుల కోసం యువతకు ఉచిత శిక్షణ

- పోలీసు శాఖలో 7,437 ఉద్యోగాల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- దరఖాస్తులకు ఈ నెల 31 వరకు అవకాశం
- యువత సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఐ విజయ సింహారెడ్డి




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖతో పాటు ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ, అగ్నిమాపక శాఖల్లో సుమారు 7,437 ఉద్యోగాల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు ఉద్యోగాలకు ప్రయత్నించే అభ్యర్థులకు ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించనున్నట్లు అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయసింహారెడ్డి తెలిపారు. పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు చెందిన యువతి, యువకులకు రాత పరీక్షలతో పాటు శారీరక దారుఢ్య శిక్షణ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తారని పేర్కొన్నారు.పోలీసు ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 26 నుంచి 31వ తేదీ వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలకు సంబంధించిన అధ్యయన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు నకలు ప్రతులను జత చేసి సమర్పించాలని తెలిపారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అభ్యర్థుల ఎంపికలో భాగంగా సెప్టెంబర్ 6న కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు పట్టణాల్లో ప్రత్యేక అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఐ విజయసింహారెడ్డి తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన వారికి కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా కేంద్రం తదితర వివరాలను అధికారికంగా ప్రకటిస్తారని పేర్కొన్నారు.పోలీసు కొలువును లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమ శిక్షణతో కృషి చేయాలని ఎస్ఐ విజయసింహారెడ్డి సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనపై ప్రజల్లోకి వెళ్లాలి

- : మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



**ఇల్లందు, ఆగస్ట్ 29 (ప్రజా జ్యోతి )**బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనపై ప్రజల్లోకి వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు. శనివారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికి ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలీస్తే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బిఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పట్టణ మండలాలలో కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ, జిల్లా నాయకులు, పిఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, జిల్లా నాయకులు భూక్య దళ్ సింగ్ నాయక్, లకావత్ దేవిలాల్ నాయక్, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, మసూద్ రబ్బు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఓటు ఎంతో విలువైనది

- ఏ ఒక్క ఓటు కూడా పోకుండా చర్యలు తీసుకోవాలి
- డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

**పాల్వంచ, ఆగస్టు 29, ప్రజాజ్యోతి:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్క ఓటు ఎంతో విలువైనదని, అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.ఓటర్ల జాబితా సవరణలో భాగంగా శనివారం పాతపాల్వంచలోని 78, 79 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు నోటీసులు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బి.ఎల్.ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లతో (బి.ఎల్.ఏలు) కలిసి కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొని ఓటర్లకు వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ రెండో దశ ఎంతో కీలకమైనదని అన్నారు. బి.ఎల్.ఓలతో పాటు బి.ఎల్.ఏలు కూడా విధిగా పాల్గొని, ఓటర్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పరిశీలించాలని సూచించారు. సమాచారం లేని లేదా సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేని ఓటర్ల వివరాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారు ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కొత్వాల సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓలు చందార్కర్, రచ్చా వరుణ్, బి.ఎల్.ఏలు షేక్ ఖాజామియా, మసనం శరత్, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 47వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వాసుమల్ల సుందర్ రావు, 46వ డివిజన్ సి.పి.ఐ ఇన్‌చార్జి షేక్ అబ్దుల్ రహ్మాన్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ యాకూబ్, సయ్యద్ కరీం, గడదేశి ప్రభాకర్, బూసి శ్రీను, యాటా నాని, బాబి, గుడపాటి నాగేశ్వర రావు, కట్టా శ్రీను పాల్గొన్నారు.



## కామ్రేడ్ అనిల్‌కు జోహార్లు అర్పించిన సీపీఐ నేతలు



**పాల్వంచ, ఆగస్టు 29, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్ (రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ సభ్యుడు కామ్రేడ్ అనిల్ అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతి చెందారు. శనివారం నిర్వహించిన ఆయన దినదశ కర్మలకు సీపీఐ నాయకులు హాజరై, అనిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ పాల్వంచ మండల, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వీసంశెట్టి పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ అనిల్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేశారని, ఆయన సేవలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు.అనంతరం సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నిమ్మల రాంబాబు, గ్రామ శాఖ కార్యదర్శి బోల్ల ఉపేందర్‌రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు కొంగర అప్పారావు, గ్రామ సర్పంచ్ నిషా రాణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శెట్టిపల్లి లక్ష్మణరావు తదితరులు కామ్రేడ్ అనిల్ చిత్రపటానికి నివాళులర్పించి జోహార్లు అర్పించారు.కామ్రేడ్ అనిల్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పాస్టర్ల సేవలు అభినందనీయం

- మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**దమ్మపేట, ఆగస్టు 29(ప్రజాజ్యోతి):** సమాజంలో శాంతి, సోదరభావం, సేవా భావాన్ని పెంపొందించడంలో పాస్టర్ల పాత్ర అభినందనీయమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండలం అంకంపాలెంలోని సీయోను ప్రార్థనా మందిరంలో షాలేము బహుజన మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, పాస్టర్ కాకా రమేష్ ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంతో పాటు సామాజిక సేవలోనూ పాస్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఐక్యత, పరస్పర గౌరవం, శాంతి నెలకొనేలా మరింత కృషి చేయాలని కోరారు.సంఘం గౌరవ సలహాదారు నిరీక్షణ రావు అందించిన ఆర్థిక సహకారంతో మండలంలోని పాస్టర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన వస్త్రాలు, హెల్మెట్లు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ల గురుమూర్తి, హైకోర్టు అడ్వకేట్ పెనుబల్లి రమేష్‌బాబు, షాలేము బహుజన కమిటీ పాస్టర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న వ్యక్తి అరెస్ట్

- డి-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**పాల్వంచ, ఆగస్టు 29, ప్రజాజ్యోతి:**గంజాయి సేవిస్తున్న ఓ వ్యక్తిని పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని, అనంతరం డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఎస్కే షాబీర్ స్థానిక ఆడమ్స్ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులో గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు షాబీర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అనంతరం అతడిని భద్రాచలంలోని డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి



**దమ్మపేట, ఆగస్టు 29(ప్రజాజ్యోతి):** పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి సూచించారు. దమ్మపేట గ్రామంలో పశువైద్య ,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాడి పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే రైతులకు పాడి పరిశ్రమ ద్వారా మెరుగైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. పశువులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించడంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.శిబిరంలో పశువైద్యాధికారులు గేదెలు, ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలని వైద్యులు రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్నశెట్టి యుగంధర్, చిన్నశెట్టి చిట్టిబాబు, చిన్నశెట్టి సత్యనారాయణ, దమ్మపేట పీవీసీ పశువైద్యాధికారిణి డాక్టర్ యు. తేజారాణి, నాగుపల్లి పీవీసీ పశువైద్యాధికారి డాక్టర్ వై. సాంబబాబు, పశువైద్య సిబ్బంది ఎం. మోహన్‌రావు, ఎస్.కె. షరీఫ్ పాషా, ఎం. సుధీర్‌తో పాటు పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- వర్గపోరును సహించే దిలేదు.. పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు
- ఉప్పల వెంకటరమణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు నిరసనలు







**దమ్మపేట, ఆగస్టు 29(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న రాజకీయ పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. దమ్మపేట మండల కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ ఉప్పల వెంకట రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో వర్గపోరును ఏమాత్రం సహించేది లేదని, అధిష్ఠానం ఆదేశాలను ధిక్కరిస్తే తనతో సహా ఎవరిపైనైనా కఠిన చర్యలు తీసుకునేందుకు పార్టీ వెనుకాడదని స్పష్టం చేశారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని, అందువల్ల క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉండాలని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. పార్టీ అధినేత కేసీఆర్ అప్పగించే బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉప్పల వెంకట రమణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలు, హామీలను ప్రస్తావిస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ నాయకత్వాన్ని బలహీనపరిచే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సమావేశంలో మండలాల మాజీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- విద్యార్థులు ప్రతిరోజూ కనీసం గంటసేపు ఆటలకు కేటాయించాలి
- కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న



**పాల్వంచ, ఆగస్టు 29, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణం ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడలు, సాంప్రదాయ ఆటలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి మిర్యాల మాట్లాడుతూ విశ్వవిఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం, శారీరక దృఢత్వం, చురుకుదనం, మానసిక వికాసం పెరగడంతో పాటు ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని వివరించారు. అంతేకాకుండా ఓటమిని స్వీకరించే మనస్తత్వం, స్నేహభావం, జట్టుగా పనిచేసే లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న మాట్లాడుతూ దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన మేజర్ ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. విద్యార్థులకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ప్రస్తుత కాలంలో పిల్లలు ఎక్కువ సమయం సెల్‌ఫోన్ల వినియోగానికి, ఫోన్లలో ఆటలు ఆడటానికి కేటాయిస్తున్నారని, దీనివల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడు పెంకుల ఆట, తొక్కుడు బిళ్ల, తాడులాగుడు, కర్రాబిళ్ల వంటి సాంప్రదాయ ఆటలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.విద్యార్థులు ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయాన్ని క్రీడలకు కేటాయించాలని, ఆటలను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని వీరన్న సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు పోటీతత్వం, ఐకమత్యం, క్రమశిక్షణ వంటి విలువలు అలవడతాయని అన్నారు.

# జీసీసీ హమాలీల వేతన ఒప్పందం చేయాలి

- ఎగుమతి, దిగుమతి రేటు రూ.40కి పెంచాలి: సీఐటీయూ

**దమ్మపేట, ఆగస్టు 29(ప్రజాజ్యోతి):** ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా చౌకధరల దుకాణాలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను చేరవేయడంలో జీసీసీ హమాలీలు కీలకంగా పనిచేస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. హమాలీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. శనివారం జీసీసీ కార్యాలయంలో హమాలీల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్లకు సంబంధించిన గత వేతన ఒప్పందం గతేడాది డిసెంబరుతో ముగిసిందన్నారు. కొత్త ఒప్పందం కోసం జనవరిలోనే సంబంధిత సివిల్ సప్లై అధికారులు, మంత్రి, హమాలీ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు.కొత్త వేతన ఒప్పందం చేయాలని కోరుతూ పలుమార్లు సివిల్ సప్లై అధికారులకు, సంబంధిత మంత్రికి వినతిపత్రాలు సమర్పించామని, కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపామని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఎగుమతి, దిగుమతికి చెల్లిస్తున్న రూ.29 రేటును రూ.40కి పెంచి కొత్త ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.గత ఐదు వేతన ఒప్పందాల్లో ప్రభుత్వ అధికారులు అంగీకరించిన ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను జీసీసీ హమాలీలకు వర్తింపజేసి అమలు చేయాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, హమాలీ యూనియన్ నాయకులు భోగ్యం సత్యం, నరసయ్య, వీర్రాజు, వెంకట్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# వాలీబాల్‌లో ఆసుపాక క్రీడాకారుల జోరు

- రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపిక
- క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





**దమ్మపేట, ఆగస్టు 29(ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 18వ ఈషా గ్రామోత్సవం–రూరల్ ప్రీమియర్ లీగ్–2026లో అశ్వారావుపేట నియోజకవర్గ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. గ్రామీణ క్రీడా ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన క్రీడాకారులు అద్భుత ఆటతీరుతో విజేతలుగా నిలిచారు. ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వారిని ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. గ్రామీణ నేపథ్యం నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని అన్నారు.గ్రామాల్లో క్రీడా నైపుణ్యం ఉన్న యువత ఎంతోమంది ఉన్నారని, వారికి అవసరమైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే ఉన్నత స్థాయిలో రాణించే సామర్థ్యం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు తనవంతు సహకారం కొనసాగిస్తానని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో ఆడి అశ్వారావుపేట నియోజకవర్గానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.యువత చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని జారె ఆదినారాయణ సూచించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని అన్నారు. ఆసుపాక క్రీడాకారులు సాధించిన విజయం నియోజకవర్గంలోని ఇతర గ్రామాల యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## టీబీ బాధితుడికి న్యూట్రిషన్ కిట్ అందజేత



**చర్ల, ఆగస్టు 29:(ప్రజా జ్యోతి ):** టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్ అన్నారు. సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తుడికి న్యూట్రిషన్ కిట్ అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కే. నరసింహారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్‌కు స్నేహితుడు కావడంతో తిమ్మిరిగూడెం గ్రామానికి చెందిన ఓ టీబీ వ్యాధిగ్రస్తుడిని ఆరు నెలల పాటు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆరు నెలల పాటు ప్రతి నెలా పోషకాహార కిట్ అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా మొదటి న్యూట్రిషన్ కిట్‌ను డాక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు సాధారణంగా బలహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కొంటారని తెలిపారు. వ్యాధి కారణంగా రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటు పోషకాహార లోపం ఏర్పడే అవకాశం ఉంటుందని సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల చికిత్స సమయంలో శరీరానికి అవసరమైన శక్తి లభించి, మందులను క్రమం తప్పకుండా తీసుకోవడంలో సహాయపడుతుందని తెలిపారు.అందజేసిన న్యూట్రిషన్ కిట్‌లో 5 కిలోల బియ్యం, కిలో మంచి నూనె, కిలో కందిపప్పు, కిలో పల్లీలు, రెండు పల్లి చిక్కీలు, కిలో గోధుమపిండి, కిలో బెల్లం, 30 గుడ్లు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, డీపీఎంఓ పాయం శ్రీనివాసరావు, హెచ్ఈఓ బాబురావు, హెచ్‌వీ కె. తిరుపతమ్మ, ఎల్‌టీ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ముందు ధర్నా..
# పోలీస్‌స్టేషన్‌లో రాజీ!

- 29వ డివిజన్ కార్పొరేటర్ సాగర్ మల్హోత్రా ఇంటిముందు మహిళ ఆందోళన
- రెండో భార్యనంటూ ఆరోపణ.. పోలీసులను ఆశ్రయించడంతో ఇరు వర్గాల పంచాయితీ..



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 29, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం కార్పొరేషన్ 29వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ సాగర్ మల్హోత్రా ఇంటిముందు శనివారం ఓ మహిళ ధర్నాకు దిగడం కలకలం రేపింది. తనను కార్పొరేటర్ రెండో భార్యగా పేర్కొంటూ ఆమె ఆందోళనకు దిగినట్లు తెలుస్తోంది. అనంతరం పోలీసులను ఆశ్రయించడంతో వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

### » ఎన్నికల అఫిడవిట్ నుంచే వివాదం

ఈ వ్యవహారం వెనుక పాత వివాదం కూడా ఉంది. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 29వ డివిజన్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన కార్పొరేటర్ తన ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్కరే భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఎన్నికల అనంతరం ఆయన ప్రత్యర్థి అభ్యర్థి మాచర్ల శ్రీనివాస్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కార్పొరేటర్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారని ఆరోపిస్తూ ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై కోర్టులో కేసు కూడా దాఖలైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆ కేసు వాదన దశలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసులో రెండో మహిళతో వివాహానికి సంబంధించిన అధికారిక ఆధారాలను కోర్టులో నిరూపించాల్సి ఉండటంతో అప్పట్లో ఈ వివాదంపై స్పష్టత రాలేదని సమాచారం.

### » మళ్లీ తెరపైకి..

అయితే ఎన్నికల అనంతరం తెరపైకి వచ్చిన ఇదే వ్యవహారం ఇప్పుడు మరోసారి బయటకు వచ్చింది. తనను కార్పొరేటర్ రెండో భార్యగా పేర్కొంటున్న ఓ మహిళ శనివారం నేరుగా సాగర్ మల్హోత్రా ఇంటిముందుకు వచ్చి ధర్నా చేయడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. అనంతరం సదరు మహిళ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడినట్లు సమాచారం. సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినట్లు తెలుస్తోంది.

### » స్టేషన్‌లో హామీ పత్రం?

ఇక స్టేషన్ లో ఈ ఇరువురి ని పిలిపించి అధికారులు రాజి కుదిర్చినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా సదరు మహిళ బాధ్యతను కార్పొరేటర్‌కు అప్పగించినట్లు, ఆమెకు ఏదైనా జరిగితే కార్పొరేటర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొంటూ హామీ పత్రం కూడా రాయించుకున్నట్లు సమాచారం. అయితే ఈ హామీ పత్రం ఏ నిబంధనల ప్రకారం తీసుకున్నారు? మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారా? లేక ఇరువర్గాల మధ్య రాజీ కోసమే ఈ ప్రక్రియ చేపట్టారా? అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. దీంతో ఒకవైపు ఎన్నికల అఫిడవిట్‌లో ఒక్కరే భార్యగా పేర్కొనడం.. మరోవైపు తనను రెండో భార్యగా చెప్పుకుంటున్న మహిళ ఇంటిముందు ధర్నాకు దిగడం.. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల మధ్య రాజీ జరగడం ఇప్పుడు కొత్త గూడెం పట్టణంతో పాటు, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

### » ఎలాంటి పిటిషన్ రాలేదు ..



"ఈ విషయంపై మా పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి పిటిషన్ రాలేదు. ఒక మహిళ వచ్చి తన పిల్లాడు 29 వ డివిజన్ కార్పొరేటర్ దగ్గర ఉన్నాడని చెప్పింది. ఆ విషయం ఏమిటో తెలుసుకునేందుకు, అసలు ఏం జరిగిందో విచారించేందుకు వాళ్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించాను. అంతే తప్ప ఈ వ్యవహారానికి సంబంధించి మా వద్ద ఎలాంటి ఫిర్యాదు లేదు. ఆమె చెప్పిన విషయం ఆధారంగా ఇరువర్గాలను పిలిపించి వివరాలు తెలుసుకున్నాం. ఈ విషయంపై ఎలాంటి పిటిషన్ మా వద్ద పెండింగ్‌లో లేదు" అని త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

# భద్రాచలంలో ప్రారంభమైన పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు

- పనులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్
- రు. 46.65 కోట్ల నిధులతో ముడుదశల్లో ఘాట్ నిర్మాణాలు
- భద్రాచలం ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుంది
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు





**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 29,(ప్రజాజ్యోతి)** 2007వ సంవత్సరంలో రానున్న గోదావరి పుష్కరాలు సందర్భంగా భక్తుల సౌకర్యార్థం భద్రాచలం పుష్కర ఘాట్ నిర్మాణ పనులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి, ఈ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు లు లాంఛనంగా ప్రారంభించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు 2027 కు మూడు విడతలుగా పనులను శ్రీకారం చుట్టామని తెలిపారు. అందులో భాగంగా తొలి విడుత పనులు రు. 46.65 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని పేర్కొన్నారు.రెండో విడత పనులు రు. 1.75కోట్లు,మూడో విడత పనులు రు. 60 లక్షలు మొత్తం రు.49కోట్లతో ఈ పుష్కర ఘాట్ పనులు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చ్ నెల లోపు ఈ పనులన్నీ పూర్తి కానున్నాయని వెల్లడించారు. మొదట భద్రాచలంలో పుష్కర ఘాట్ పనులు, అనంతరం దుమ్ముగూడెం మండలంలో పర్ణశాల, బూర్గంపాడు మండలంలో మోతే పట్టి నగర్ ప్రాంతాలలో ఘాట్ పనులు కొనసాగుతాయన్నారు.చివరగా ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాలలో పుష్కర ఘాట్ పనులు జరగనున్నాయని తెలిపారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చే ఏడాది 2027 జూన్, జూలై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాల భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సరిహద్దు ప్రాంతాలైన వాజేడు, వెంకటాపురం ప్రాంతాలలో ఈ పుష్కర ఘాట్ పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం అభివృద్ధి మరమ్మత్తు పనులు రు. 351 కోట్లతో కొనసాగుతున్నాయని అన్నారు. ప్రతిరోజు జరుగుతున్న దేవాలయ మరమ్మత్తు పనులపై జిల్లా కలెక్టర్ అంకిత్, అధికారులు సమీక్షిస్తూ పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా గోదావరి పుష్కర పనులు సకాలంలో పూర్తిచేసేలా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్ అండ్ బి అధికారులు భద్రాచలం కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా ప్రణాళిక చేపట్టి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం స్నానాల ఘాట్, మరుగుదొడ్లు తదితర వసతులన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భద్రాచలం ప్రాంతాన్ని కంటికి రెప్పలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆలయ ఈ.వో దామోదర్ రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, ఇరిగేషన్ సీ.ఈ శ్రీనివాస్ రెడ్డి,ఎస్.ఈ మహేశ్వర రావు, డీ.ఈ సబ్ డివిజన్ -1భాగ్యరాజ్ రాథోడ్,ఈ.ఈ జానీ, భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణ, పంచాయతీ ఈ.వో శ్రీనివాస్,తహసీల్దార్ రవి,వార్డు సభ్యులు సుబ్బా రావు, స్థానికులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, బుడగం శ్రీనివాస్,ఏ.ఈ.ఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.